క్లుప్తంగా

ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపేలా చర్యలు తీసుకోండి



రైల్వే సహాయమంత్రి సోమన్నకు వినతిపత్రం అందిస్తున్న ప్రముఖులు, ప్రయాణికులు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం రైల్వేస్టేషన్ జంక్షన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్‌నకు చర్యలు తీసుకోవాలని కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్నను కలిసి రైల్వే యాక్షన్ కమిటీ, బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం చిక్‌మంగళూరు నుంచి హొస్పేట్‌కు ప్రత్యేక రైలులో వెళ్తున్న మంత్రిని రాయదుర్గంలో జయంతి సురేష్‌కుమార్, వాడేకర్ అంభోజీ రావు తదితరులు కలిశారు. స్థానిక స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాయదుర్గం మీదుగా వెళ్తున్నా స్టాపింగ్ లేదన్నారు. కణేకల్లు రోడ్డు, అనంతపురం రోడ్డులోని రైల్వే ఓవర్ బ్రిడ్జిలను పూర్తి చేయాలని, స్టేషన్‌లో కనీస వసతులు లేవని, రాయదుర్గం– టుంకూరు రైలు మార్గాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, రాయదుర్గం మీదుగా విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు, ముంబయ్ నగరాలకు రైళ్లను నడపాలని వినతిపత్రం సమర్పించారు.

వ్యవసాయ మెలకువలు పాటించాలి



చాబాలలో రైతులకు కందులను అందజేస్తున్న సర్పంచు మల్లెల జగదీష్ తదితరులు

వజ్రకరూరు: వ్యవసాయంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ మెలకువలు పాటిస్తూ ముందుకు సాగాలని సర్పంచు మల్లెల జగదీష్ అన్నారు. శుక్రవారం మండలంలోని చాబాల రైతుసేవా కేంద్రంలో ఉచిత కందుల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచు మల్లెల జగదీష్ ప్రారంభించారు. సర్పంచు మాట్లాడుతూ పంటల సాగులో వ్యవసాయ అధికారుల సలహాలు,సూచనలు తప్పక పాటించాలన్నారు. మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులు దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ కళ్యాణి, గ్రామపెద్దలు పంపాపతి, శ్రీనివాసులు, ఈశ్వరయ్య, రాంబాబు, మహేష్, నాగరాజు, సురేష్‌బాబు, వన్నార్జన, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచుకు సన్మానం



సర్పంచు మోనాలిసాను సన్మానిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: స్థానిక ప్రాథమిక పాఠశాలలో మేజర్ పంచాయతీ సర్పంచు మోనాలిసాను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో సర్పంచు మోనాలిసా పాల్గొని, పలు అంశాలపై చక్కగా మాట్లాడి, ప్రశంసలు పొందారు. అనంతరం జరిగిన కార్యక్రమంలోఎంఈఓలు ఎర్రిస్వామి, తిమ్మప్ప, హెచ్ఎం రంగప్రసాద్, సామాజిక కార్యకర్త బెంజ్‌మెన్, ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఢిల్లీలో జరిగిన శిక్షణ కార్యక్రమానికి సర్పంచు ఎంపిక కావడం సంతోషకరమన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్



విడపనకల్లులో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

విడపనకల్లు: మండల కేంద్రంలో డాక్టర్ మజరద్ జాహ, డాక్టర్ పుష్ప, ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ బత్తుల కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని శుక్రవారం అవగాహన ర్యాలీ చేశారు. దోమలతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, విష జ్వరాలు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. దోమలు లేకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పరిసరాల చుట్టూ దోమలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ చిన్న కంబయ్య, అమృత లత, స్టాఫ్ నర్సు తులసి, ల్యాబ్ టెక్నీషియన్ నూర్ బాషా, ఆరోగ్య కార్యకర్త నూర్, మహ్మద్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

దోమ తెరలు తప్పనిసరిగా వాడాలి

రాయదుర్గంటౌన్: రాత్రి వేళల్లో దోమ తెరలు వాడడం శ్రేయస్కరమని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నాగేంద్రప్రసాద్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని 32వ వార్డులోని వాల్మీకినగర్‌లో సీజనల్ వ్యాధులు, డ్రైడేపై మహిళలకు అవగాహన కల్పించారు. జ్వర లక్షణా లు ఉంటే సమీప ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందాలన్నారు. హెల్త్ అసిస్టెంట్లు ఎర్రిస్వా మి, సూర్య నారాయణ, శ్రీనివాసులు, రవి రాజు, శానిటరీ సెక్రటరీ హిమబిందు, ఆశా కార్యకర్త ఉమ పాల్గొన్నారు.

కూటమి పాలన.. అడుగడుగునా దగా

- హామీల అమలులో ఘోరంగా విఫలం
- 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' పేరుతో ప్రచారం చేద్దాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, పార్టీ పరిశీలకుడు నరేష్, మాజీ ఎమ్మెల్యే మెట్టు
- 'రీ కాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' క్యూఆర్ కోడ్ పోస్టర్ల ఆవిష్కరణ



క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు అనంత, పరిశీలకుడు నరేష్‌కుమార్‌రెడ్డి, మెట్టు



మాట్లాడుతున్న మెట్టు (చిత్రం)లో జిల్లా అధ్యక్షుడు అనంత, పరిశీలకుడు నరేష్‌కుమార్‌రెడ్డి, నేతలు

రాయదుర్గం: ఎన్నికల్లో అలవిగాని హామీలివ్వడం .. గద్దెనెక్కాక వాటిని తుంగలో తొక్కి ప్రజల్ని మోసగించడం సీఎం చంద్రబాబుకు వెన్నతోపెట్టిన విద్య అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకుడు నరేష్ కుమార్ రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవింద రెడ్డి విమర్శించారు. శుక్రవారం మండలంలోని మద్దానేశ్వర కళ్యాణ మండపంలో రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు అనంత, పార్లమెంట్ పరిశీలకుడు నరేష్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. 'రీ కాల్ చంద్రబాబూస్' మేనిఫెస్టో పేరుతో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' క్యూర్‌ఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి మాట్లాడారు. కూటమి సర్కార్ హామీల అమలులో ఘోరంగా విఫలమైందన్నారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలకు తోడు మరో 143 పథకాలు అమలు చేస్తామని, సూపర్ సిక్స్ పేరిట ఇంకో ఆరు పథకాలు ఇస్తామని ఊరూరా ఊదరగొట్టారన్నారు. నమ్మి ఓట్లేసిన ప్రజలకు పంగనామాలు పెట్టారని దుయ్యబట్టారు. కూటమి సర్కార్ అధికారం చేపట్టి 13 నెలలు కావస్తున్నా.. ఏ ఒక్క పథకమైనా సక్రమంగా ప్రజలకు అందించలేదన్నారు. సూపర్‌సిక్స్ లేదు, సెవెనూ లేదని ప్రజలకు అర్థమైందన్నారు. ఈ తప్పుడు హామీలపై ఇంటింటా వివరిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమన్నారు. చంద్రబాబు మోసంతో ప్రతి కుటుంబం ఎంత నష్టపోయిందో లెక్కలతో ఇంటింటా వివరిద్దామన్నారు. ప్రతి గ్రామంలోనూ ఈ కార్యక్రమం విస్తృతంగా నిర్వహించాలని పార్టీ నాయకత్వానికి దిశా నిర్దేశం చేశారు. సంపాదన కోసం తాను రాజకీయాల్లోకి రాలేదని, సేవ చేయాలనే తపన, పట్టుదల, రాయదుర్గం ప్రజలు చూపుతున్న ప్రేమాభిమానాల కోసం దృఢనిశ్చయంతో పనిచేస్తానని మెట్టు గోవిందరెడ్డి అన్నారు. గత ఎన్నికల్లో ప్రజా తీర్పు వ్యతిరేకంగా వచ్చినా ఎక్కడికీ వెళ్లకుండా మీ మధ్యనే ఉంటూ సేవ చేస్తున్నానని గుర్తు చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోరాళ్ల శిల్ప, రాష్ట్ర సహాయ కార్యదర్శి కోకూర్తి ఉషారాణి, ఎస్సీ, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శులు గోవిందు, బోజరాజ్‌నాయక్ లు మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు పద్మావతి, హొన్నే మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ పట్టణ, గుమ్మఘట్ట, డి హీరేహాళ్, కణేకల్లు, బొమ్మనహాళ్, రాయదుర్గం మండలాల కన్వీనర్లు మేకల శ్రీనివాసులు, గౌని లక్ష్మీ కాంతారెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రామాంజనేయులు, రామాంజనేయులు యాదవ్, చేనేత విభాగం రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు పోరాళ్ల శివా, కూన నాగప్ప, జిల్లా కార్యదర్శి మారెప్ప, ప్రచార కార్యదర్శి కేపీదొడ్డి రమేష్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, మాజీ జెడ్పీటీసీ, ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

బాబూ.. రైతులంటే అలుసెందుకు?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు భరోసా లేకుండా పోయిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి అన్నారు. మామిడి, పొగాకు, మిర్చి, వేరుశెనగ ఇలా ఏ పంటకు మద్దతు ధర లేక రైతులు రోడ్డున పడ్డారన్నారు. ఆఖరకు వరి కొనుగోలు చేసి రెండు నెలలవుతున్నా నేటికీ డబ్బులు జమ కాలేదన్నారు. ధరలేక తీవ్రంగా నష్టపోయిన మామిడి రైతుల్ని పరామర్శించేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తే చంద్రబాబుకు వణుకెందుకని ప్రశ్నించారు. అడుగడుగునా పోలీసు ఆంక్షలు సరైంది కాదన్నారు. తల్లికి వందనం ఎంతమంది ఉంటే అంత మందికి ఇస్తామని చెప్పి , తీరా చూస్తే కొంతమందికే జమచేశారన్నారు. ప్రభుత్వ హామీలపై ప్రశ్నిస్తే నాలుక మందమనే వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. వైఎస్ జగన్ ప్రశ్నించేది మొదలుపెట్టాకే.. ఉచిత గ్యాస్, తల్లికి వందనం పథకాలు అరకొరగా ఇచ్చారని దుయ్యబట్టారు. పేదలంటే ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ మహిళలకు ఏడాదికి రూ.18 వేలు ఆశచూపి మోసం చేశాడన్నారు. ఉచిత బస్సుపై మాటా మార్చేశాడన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులు పెడితే భయపడేది లేదన్నారు. మీ అందిరి వెంట వైఎస్ జగన్ ఉన్నాడనే విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ పై ఇంటింటా వివరించే బాధ్యత ప్రతి కార్యకర్త తీసుకోవాలన్నారు.

క్యూఆర్ కోడ్‌పై అవగాహన అవసరం



కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు నెరవేర్చకపోవడంతో పేద, మధ్యతరగతి కుటుంబం ఏడాదికి రూ.5 లక్షల వరకు నష్టపోవాల్సి వచ్చింది. ఇదే విషయాన్ని పార్టీ పరిశీలకుడు సెల్‌ఫోన్లలో క్యూఆర్ కోడ్‌ను డౌన్‌లోడ్ చేయించి పార్టీ శ్రేణులకు వివరించారు. ప్రతి ఇంటికీ ఈ క్యూఆర్‌కోడ్ చేర్చే బాధ్యత పార్టీ నాయకత్వంపై ఉంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప ఆలోచనతో పుట్టుకొచ్చిన ఈ క్యూఆర్ కోడ్‌పై ప్రతి చోటా చర్చ జరగాలి. జగన్ ఐదేళ్ల పాలనకు ఈ 13 నెలల చంద్రబాబు పాలనకు ప్రజలు ఓ సారి బేరీజు వేసుకోవాలి. చంద్రబాబు అనేక సంక్షేమ పథకాలకు మంగళం పాడటంతో పాటు సూపర్‌సిక్స్ హామీలను అటకెక్కించారు.

– నరేష్‌కుమార్‌రెడ్డి, పార్లమెంట్ పరిశీలకుడు

బాబు మోసాలపై యుద్ధం



ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను మరోసారి ముంచారు. రీ కాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో, బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీపై ఇంటింటా వివరించే బాధ్యత యువత తీసుకోవాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలనూ మోసం చేసింది. జగన్ 2.0 కు ప్రజలంతా ఎదురుచూస్తున్నారు. భవిష్యత్తు వైఎస్సార్‌సీపీదే. పార్టీ పటిష్టతకోసం అందరూ సమన్వయంతో కలసికట్టుగా ముందుగా నడవాలి.

– మెట్టు విశ్వనాథ్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి

ఎస్ఎస్ ట్యాంకులో నీటి పంపింగ్‌కు ఏర్పాట్లు పూర్తి



ప్రస్తుతం సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులో నిల్వ ఉన్న తుంగభద్ర జలాలు

రాయదుర్గంటౌన్: టీబీ డ్యాం నుంచి హెచ్చెల్సీకి నీటిని విడుదల చేశారు.. రాయదుర్గానికి తాగునీరు అందించే డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శాశ్వత మంచి నీటి పథకం కింద కణేకల్లులోని ఎస్ఎస్ ట్యాంకులోకి కెనాల్ నుంచి నీటి పంపింగ్‌కు మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, డీఈఈ పోరాళ్ల సురేష్ మాట్లాడుతూ కణేకల్లులోని ఎస్ఎస్ ట్యాంకు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 3,052 మిలియన్ లీటర్లు కాగా ప్రస్తుతం 1,255 మిలియన్ లీటర్ల నీటి నిల్వ ఉందన్నారు. ఇంకా 140 రోజులకు సరిపడ నీటి నిల్వ ఉందన్నారు. ఒక వ్యక్తికి వంద లీటర్ల ప్రకారం పట్టణానికి ఒక రోజుకు ఎస్ఎస్ ట్యాంకు నుంచి 11 మిలియన్ లీటర్ల తాగునీటిని అందజేస్తున్నట్లు చెప్పారు. నీటి లభ్యత, లీకేజీలను దృష్టిలో ఉంచుకుని మూడురోజులకోసారి నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. హెచ్చెల్సీకి నీరు చేరుకున్న తర్వాత పంపింగ్ కోసం దాదాపు 60 హెచ్‌పీ సామర్థ్యం ఉన్న నాలుగు మోటార్లను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. నీటి పంపింగ్‌లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈ సారి ముందస్తుగా నీటిని విడుదల చేసిన దృష్ట్యా వచ్చే ఏడాది వరకు తాగునీటి కొరత ఉండదన్నారు. దశల వారిగా పైప్‌లైన్ లీకేజీల మరమ్మతును చేపట్టి నీటి వృథా అరికడతామన్నారు.

వైఎస్ జగన్‌తోనే విద్యా విప్లవం

- వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్‌రెడ్డి

ఉరవకొండ: రాష్ట్రంలో విప్లవాత్మక సంస్కరణలతో విద్యా విప్లవాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చారని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్‌రెడ్డి అన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో గురువారం జరిగిన పీటీఎం కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ×తల్లికి వందనం× లోకేష్ ఆలోచనే అని ప్రకటించడాన్ని ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో ఖండించారు. నవీన్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తచెరువు సభలో సీఎం చంద్రబాబు తన కొడుకు లోకేష్‌ను పొగడ్తలతో ముంచెత్తారని, ఇందులో పిల్లలు, ఉపాధ్యాయుల ఎదుట నిస్సిగ్గుగా తల్లికి వందనం లోకేష్ ఆలోచనలో నుంచే పుట్టిందని చెప్పడం సరికాదన్నారు. ఈమాట విన్న యావత్తు రాష్ట్ర ప్రజలు ఆశ్చర్యపోయారన్నారు. అమ్మ ఒడి పథకాన్ని అమలు చేసి, దేశ వ్యాప్తంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరి ప్రశంసలు అందుకున్నారని గుర్తు చేశారు. అలాంటిది కూటమి ప్రభుత్వం పథకం పేరు మార్చి అదే నగదు అందిస్తున్నారని, ఇది లోకేష్ ఘనత ఎలా అవుతుందన్నారు. ఇప్పటి వరకు తల్లికివందనం పేరును కూడా ఎవరు పలకడం లేదని, అమ్మఒడి పథకం అనే అంటున్నారన్నారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్ది, అమ్మ ఒడి, జగనన్న వసతి దీవెన, విద్యాదీవెన లాంటి పథకాలు విజయవంతంగా వైఎస్సార్‌సీపీ హయాంలో అందాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ సిలబస్‌ను తీసుకొచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వంలో మంత్రి లోకేష్ అనాలోచిత నిర్ణయాలతో విద్యా వ్యవస్థ భ్రష్టుపట్టించారన్నారు.

యూటీ పనుల పరిశీలన

కణేకల్లు: మండలంలోని యర్రగుంట గ్రామ శివారులో హెచ్చెల్సీకి 137 కిలో మీటర్ వద్ద జరుగుతున్న యూటీ పనులను రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. హెచ్చెల్సీ ఆధునికీకరణ పనుల పురోగతిపై మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 15 నుంచి హెచ్చెల్సీకి నీటి సరఫరా జరుగుతోందని, ఈలోపు ముఖ్యమైన పనులన్నీ పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

పంట పొలాల్లోకి దారి చూపండి

కళ్యాణదుర్గం రూరల్: పంట పొలాల్లోకి దారి చూపాలని మండలంలోని పాపంపల్లి గ్రామ రైతులు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును కోరారు. శుక్రవారం ఆయన కొత్తూరు పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా మోరేపల్లి గేట్ వద్ద రైతులందరూ ఎమ్మెల్యేను కలిసి సమస్య విన్నవించారు. రైతులు మాట్లాడుతూ ఎనిమిదినెలలుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితంలేక పోతోందన్నారు.

సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ప్రత్యేక స్థానం



చిన్నహోతూరులో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ప్రత్యేక స్థానం ఉందని హెచ్ఎం శ్రీని వాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నహోతూరు జెడ్పీహెచ్ఎస్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులు, నూతన ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుగులం నాగరాజు, ఎంబీఎల్ ప్రసాద్, మునీంద్ర, మస్తాన్‌వలి, మల్లికార్జున తదితరులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. హెచ్ఎం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. కార్యక్రమంలో రిటైర్డు హెచ్ఎం షాహిన్, పీఈటీ ప్రభాకర్, ఉపాధ్యాయులు రాఘవ, నారాయణ స్వామి, రజనీ, వెంకట్, శ్రీనివాస్‌రావు, గుప్త, అమరేంద్ర, పద్మాజ, సరస్వతి, గంగాధర్, సుభోస్ తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరులో.... : స్థానిక ప్రాథమిక పాఠశాలలో బదిలీపై కొనకొండ్ల పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయుడు ధనుంజయను శుక్రవారం సన్మానించారు. సర్పంచు మోనాలిసా, ఎంఈఓలు ఎర్రిస్వామి, తిమ్మప్ప, ప్రధానోపాధ్యాయు డు రంగప్రసాద్, సామాజిక కార్యకర్త బెంజిమెన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం



రాయదుర్గంలో ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంటున్న ఈయూ నాయకులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఏపీఎస్ ఆర్టీసీ డిపోలో ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. డిపో ఆవరణలో ఈయూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్‌కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రామలింగ, ఎస్ఎస్ వలి, శ్రీరాములు, ఏఐటీయూసీ నాయకులు నాగార్జున, టీ3 ఉమాపతి, ఈయూ నాయకులు బి.బాష, తిప్పారెడ్డి, అరుణ్, మురళి, గ్యారేజ్ నాయకులు సిద్ద, ఇది, శ్రీకాంత్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఎంప్లాయీస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. కేక్ కట్‌చేసి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రీజినల్ ప్రెసిడెంట్ ఆర్‌వీ భాస్కర్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో డిపో ప్రెసిడెంట్ వేణుగోపాల్, ఉద్యోగులు రఫీ, రామకృష్ణ, కదిరప్ప, ప్రకాష్ లింగప్ప, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా కలశ ప్రతిష్ట

విడపనకల్లు: మండల పరిధిలోని గడేకల్లు గ్రామంలో భీమలింగేశ్వరస్వామి రథోత్సవంలో భాగంగా శుక్రవారం రథోత్సవంపై వేద మంత్రోచ్ఛారణలతో అర్చకులు కలశ ప్రతిష్ట చేశారు. ఉదయం భీమలింగేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భీమలింగేశ్వరస్వామికి మాంసం, మద్యం సమర్పించి, భక్తులకు ప్రత్యేక పూజలు చేశారు.

నేడు భీమలింగేశ్వరస్వామి రథోత్సవం..: భీమలింగేశ్వరస్వామి రథోత్సవం మంగళవారం జరగనుంది. ఆశాఢ మాసంలో భీమలింగేశ్వరస్వామి రథోత్సవం జరుగుతుండడంతో మండలం నుంచే కాక పొరుగు జిల్లాలు కర్నూలు,కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారని అర్చకులు తెలిపారు.

ముగిసిన మొహర్రం

గుమ్మఘట్ట: మండల కేంద్రంలో మొహర్రం వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. వేకువజామున తిరిగి సాయంత్రం వేళల్లో పీర్లస్వాములను గ్రామస్తులు గ్రామంలో మేళతాళాలతో ఊరేగించి, మొక్కులు తీర్చుకున్నారు. యువకులు ఉత్సాహంగా అగ్నిగుండం చుట్టూ అలావ్ తొక్కారు.

విద్యార్థి జేఏసీ నియోజకవర్గ కన్వీనర్‌గా సాకే పురుషోత్తం

ఉరవకొండ: స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విద్యార్థి సంఘాల సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో విద్యార్థి సంఘాల జేఏసీ కన్వీనర్‌గా వైఎస్సార్ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షులు సాకే పురుషోత్తంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులు భీమేష్, పృద్వీరాజ్, ప్రధాన కార్యదర్శి హిరణ్య, కార్యదర్శిగా భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జైకుమార్‌స్వామి, కోశాధికారిగా ముండ్ల రాము, అధికార ప్రతినిధిగా గణేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నగేష్, కార్యవర్గ సభ్యులుగా మహేంద్ర, ధనంజయ, రామాంజనేయులు, చెన్నకేశవులు, ప్రిన్స్, సలహాదారుగా మీనుగ మధు నియమితులయ్యారు.

సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి చేద్దాం

బొమ్మనహాళ్: మండల అభివృద్ధికి సమన్వయంతో పని చేద్దామని ఎంపీడీఓ విజయభాస్కర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ పురోగతి సమీక్ష శిక్షణ కార్యక్రమాన్ని అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ అభివృద్ధి పరమావధిగా పనిచేయాలన్నారు. ఉపాధిహామీ కింద పండ్లమొక్కలు పంపిణీ చేయాలని, ప్రతి ఒక్కరికి కూలీకి ఉపాధి పనులు కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ దాస్, ఎంఈఓ మల్లికార్జున, ఏపీఎం రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శీనానాయక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ

కూడేరు: ప్రతి గ్రామ పంచాయతీ పురోగతి, సుస్థిరత సాధించేలా కృషి చేయాలని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోపంచాయతీ సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, హౌసింగ్ డీఈ హనుమప్ప, ఏఓ శుభకర్, ఎంఈఓ మహమ్మద్ గౌస్, పీఆర్ ఏఈ రమణయ్య, ఏపీఎం దేవానంద ఫిలిప్సన్, ఏపీఓ పోలేరయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖ, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణతో ఆరోగ్యకర జీవితం

కూడేరు: కుటుంబ నియంత్రణతో ఆరోగ్యకర జీవితం గడపడానికి అవకాశం ఉంటుందని వైద్యాధికారిణి ఉషారాణి అన్నారు. శుక్రవారం ప్రపంచ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య సిబ్బంది కూడేరులో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ ఉషారాణి మాట్లాడారు. కుటుంబ నియంత్రణ ద్వారా ఆర్థికంగా బలపడొచ్చన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సరోజమ్మ, సూపర్ వైజర్లు యశోద, రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవంపై ప్రదర్శన



ప్రపంచ జనాభా దినోత్సవంపై ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బొమ్మనహాళ్: బొమ్మనహాళ్, ఉద్దేహాళ్ గ్రామాల్లో ప్రపంచ జనాభా దినోత్సవంపై ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. వైద్యాధికారిణి శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఒక్కరు ముద్దు.. ఇద్దరు హద్దు అనే నినాదాలతో విద్యార్థుల ప్రదర్శన సాగింది. అనంతరం జనాభా పెరుగుదలతో ఎదురయ్యే సమస్యలపై వివరించారు. ప్రసవం అనంతరం కుటుంబ నియంత్రణ పాటించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఈశ్వరయ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

శిక్షణతో పారదర్శక ఓటర్ల జాబితా

రాయదుర్గంటౌన్: బీఎల్ఓలకు ఇస్తున్న జాతీయ స్థాయి శిక్షణతో పారదర్శకత గల మెరుగైన ఓటర్ల జాబితా సాధ్యమని ఈఆర్ఓ రవిశంకర్ రెడ్డి తెలిపారు. జాతీయ స్థాయి బీఎల్ఓల శిక్షణ కార్యక్రమంలో భాగంగా నాల్గో రోజు శుక్రవారం స్థానిక డ్వామా హాల్‌లో రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గం కణేకల్లు, రాయదుర్గం మండలంలోని 50 మంది బీఎల్ఓలు శిక్షణకు హాజరయ్యారు. మాస్టర్ ట్రైనర్ వెంకటరమేష్ శిక్షణ ఇచ్చారు. రాయదుర్గం, కణేకల్లు మండల తహసీల్దార్లు నాగరాజు బ్రహ్మయ్య, ఎలక్షన్ డీటీ సుజాత తదితరులు హాజరయ్యారు.

అంతర్జాతీయ జనాభా దినోత్సవం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో ఎన్ఎస్ఎస్, అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ హర్షలత మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధి సూచికపై శిక్షణ

బెళుగుప్ప: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ వనరుల అభివృద్ధి సూచికపై అధికారులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ హరికృష్ణ, వైద్యాధికారి కార్తీక్‌రెడ్డితో కలసి శిక్షకులు వర్ల శంకర్ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ బలోపేతానికి అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ 2.0తో గ్రామ పంచాయతీల నిధుల కేటాయింపు అంశాలపై పంచాయతీ సెక్రటరీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఓ పృధ్వీ సాగర్, ఈఓఆర్‌డీ శివరంజని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి

వజ్రకరూరు: పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఈఓఆర్‌డీ దామోదర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భ వనంలో పంచాయతీ రాజ్ పురోగతి సూచికపై శిక్షణ ఇచ్చారు. ఇప్పటి వరకు పంచాయతీల సాధించిన ప్రగతి, సాధించాల్సిన అంశాలు తదితర వాటిపై వివరించారు.కార్యక్రమంలో పీఆర్ ఇంజినీర్ మణిభూషణ్, గడేహోతూరు వైద్యాధికారి మారుతి, హౌసింగ్ ఏఈ చెన్నారెడ్డి, ట్రైనర్స్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ చొరవ .. నెరవేరిన ప్రజల కోరిక



పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

కణేకల్లు: యర్రగుంట ప్రజల చిరకాల కోరిక నెరవేరింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పీహెచ్‌సీ భవన నిర్మాణానికి రూ.1.72 కోట్లు మంజూరు చేసింది. యర్రగుంట గ్రామంతోపాటు పరిసర గ్రామాల ప్రజలకు వైద్యసేవలందించేందుకు పీహెచ్‌సీని ఏర్పాటు చేశారు. ఈ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆస్పత్రి ఏర్పాటుకు నిధులు మంజూరు చేసింది. పనులన్నీ చకచకా సాగినా, 2024 సార్వత్రిక ఎన్నికల కోడ్ కారణంగా ప్రారంభానికి నోచుకోలేదు. యర్రగుంట, జక్కలవడికి, గెనిగెర, అంబాపురంతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజల ఆశ ఎట్టకేలకు నెరవేరింది. పీహెచ్‌సీ భవనాన్ని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, డీఎంహెచ్ఓ ఈబీ దేవితో కలిసి మంత్రి పయ్యావుల కేశవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ హనుమంతరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ వన్నారెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ చాంద్ బాషా, నాయకులు ఆనంద్‌రాజ్, లాలెప్ప తదితరులు పాల్గొన్నారు.